మనం
కడప | అన్నమయ్య

# నందలూరు ఎంపీపీ పీఠంపై యల్లటూరు శివరామరాజు గురి

2దశబ్దాల పైగా స్థానిక రాజకీయ అనుభవం

జనసేన శ్రేణుల సమన్వయంతో గెలుపే లక్ష్యంగా సరికొత్త వ్యూహ

గ్రామస్థాయి కేడర్.. బలమైన రాజకీయ పునాది - ఎంపీటీసీ సభ్యుల సమీకరణంపై ప్రత్యేక దృష్టి

యల్లటూరు వ్యూహంతో నందలూరు రాజకీయాల్లో పెరుగుతున్న వేడి




మనం ప్రతినిధి రాజంపేట అక్టోబర్ 14

పోలూరు పంచాయతీ కుమ్మరిపల్లె నుంచి రాజకీయ ప్రస్థానం ప్రారంభించి, స్థానిక సంస్థల్లో తనదైన ముద్ర వేసిన సీనియర్ నేత,జనసేన రాజంపేట అసెంబ్లీ నియోజక వర్గం సమన్వయ కర్త అయిన యల్లటూరు శివరామరాజు ఇప్పుడు నందలూరు ఎంపీపీ పీఠాన్ని దక్కించుకోవడమే లక్ష్యంగా రాజకీయ చదరంగంలో కీలక పావులు కదుపుతున్నారు. గతంలో రెండుసార్లు స్వతంత్ర అభ్యర్థిగా ఎంపీటీసీగా ఘనవిజయం సాధించి మండల ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వర్తించడమే కాకుండా, 2014లో జెడ్పీటీసీగా రికార్డు స్థాయి మెజారిటీతో గెలుపొంది మండలవ్యాప్తంగా తన తిరుగులేని పట్టును నిరూపించుకున్నారు. ప్రత్యర్థులు ఎంతటి బలమైనవారైనా క్షేత్రస్థాయి కేడర్‌ను నమ్ముకుని విజయాలు సాధించడమే ఆయన రాజకీయ బలంగా మారింది. మౌలిక వసతుల కల్పన, రోడ్లు, పేదల ఇళ్లు, పింఛన్లు వంటి సంక్షేమ పథకాల అమలుతో గ్రామాభివృద్ధిలో తనదైన చెరగని ముద్ర వేసిన ఆయనకు మండలవ్యాప్తంగా విస్తృతమైన ప్రజాసంబంధాలు, బలమైన రాజకీయ అనుబంధం ఉన్నాయి. ప్రస్తుతం రాజంపేట అసెంబ్లీ నియోజకవర్గం సమన్వయ కర్తగా జనసేన పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తూ, నియోజకవర్గ స్థాయిలో పార్టీ సిద్ధాంతాలను, అధినేత పవన్ కళ్యాణ్ ఆశయాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళు_న్న శివరామరాజు, నందలూరు మండల పరిషత్ అధ్యక్ష పీఠాన్ని కైవసం చేసుకోవడమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు. జనసేన బలమైన కేడర్ తోడ్పాటుతో పాటు క్షేత్రస్థాయిలో ఉన్న ఎంపీటీసీ సభ్యుల మద్దతును కూడగట్టడంపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. సామాజిక సమీకరణాలు, కూటమి లెక్కలను సమన్వయం చేసుకుంటూ ప్రత్యర్థులకు పూర్తిస్థాయిలో చెక్ పెట్టేలా ఆయన సిద్ధం చేస్తున్న వ్యూహాలు స్థానిక రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. గత అనుభవం, జనసేన పార్టీ వెన్నుదన్ను, క్షేత్రస్థాయి వ్యూహాలతో శివరామరాజు వేస్తున్న ముందడుగు నందలూరు మండల రాజకీయాల్లో సరికొత్త జోష్‌ను నింపుతోంది.

నందలూరు మండల పరిషత్ రాజకీయాల్లో మరోసారి ఎన్నికల వేడి తారస్థాయికి చేరుకుంటోంది. స్థానిక సంస్థల పరిధిలో అపారమైన అనుభవం, గ్రామీణ స్థాయిలో పటిష్టమైన కేడర్ కలిగిన మాజీ జెడ్పీటీసీ, జనసేన ప్రముఖ నాయకుడు యల్లటూరు శివరామరాజు నందలూరు ఎంపీపీ పీఠంపై పూర్తిస్థాయిలో దృష్టి సారించారు. క్షేత్రస్థాయి సమీకరణాలు, ఎంపీటీసీల సంఖ్యాబలంపై పక్కా ప్రణాళికలు రచిస్తూ మండల పీఠాన్ని దక్కించుకునేందుకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు.

### స్వతంత్ర అడుగు నుంచి జెడ్పీటీసీ దాకా విజయాల ప్రస్థానం

?శివరామరాజు రాజకీయ ప్రస్థానం స్థానిక సంస్థల పునాదుల నుంచే మొదలైంది. పార్టీ గుర్తుల కంటే వ్యక్తిగత ఇమేజ్, ప్రజలతో ఉన్న అనుబంధమే బలమని ఆయన పలు ఎన్నికల్లో నిరూపించుకున్నారు.

### స్వతంత్ర ఎంపీటీసీగా ఆరంభం..

2001లో స్వతంత్ర అభ్యర్థిగా ఎంపీటీసీ బరిలోకి దిగి ఘనవిజయం సాధించారు. అనంతరం మండల ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టి మండల రాజకీయాల్లో కీలక గుర్తింపును సంపాదించుకున్నారు.

### అధికార పార్టీపై నెగ్గిన వ్యూహం..

2006 ఎన్నికల్లో అప్పటి అధికార కాంగ్రెస్ పార్టీ హవా నడుస్తున్నప్పటికీ, స్వతంత్ర అభ్యర్థిగానే పోటీ చేసి ప్రత్యర్థిపై విజయం సాధించి తన వ్యక్తిగత పట్టును మరోసారి చాటుకున్నారు.

?జెడ్పీటీసీగా విస్తరించిన పరిధి ..

2014లో టీడీపీ అభ్యర్థిగా నందలూరు జెడ్పీటీసీ స్థానానికి పోటీ చేసి భారీ మెజారిటీతో విజయం సాధించారు. దీంతో ఆయన రాజకీయ పరిధి గ్రామ, మండల స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయికి విస్తరించింది.

### మౌలిక సదుపాయాల కల్పనే బలం.. ప్రజాక్షేత్రంలో నిరంతరం చొరవ

యల్లటూరు కుటుంబానికి బలమైన అనుబంధం ఉన్న సొంత గ్రామం కుమ్మరిపల్లె నుంచి మొదలుకొని నందలూరు మండలంలోని పలు పంచాయతీల వరకు రహదారుల నిర్మాణం, తాగునీరు, విద్య, పేదలకు గృహ నిర్మాణాలు, పింఛన్లు, దీపం గ్యాస్ కనెక్షన్ల వంటి మౌలిక వసతులు, సంక్షేమ కార్యక్రమాలపై గతంలో ఆయన ప్రత్యేక చొరవ చూపారు. పదవుల్లో ఉన్నా లేకున్నా ప్రజల మధ్యే ఉంటూ ప్రజా సమస్యలపై స్పందిస్తున్నారు. ఇటీవల ఎగువ కుమ్మరపల్లిలో ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించడం వంటి సామాజిక కార్యక్రమాలతో ప్రజలకు నిరంతరం చేరువగా ఉంటున్నారు.

### జనసేన వేదికగా సరికొత్త సమీకరణాలు

ప్రస్తుతం జనసేన పార్టీలో క్రియాశీలక పాత్ర పోషిస్తున్న శివరామరాజు, పార్టీ అధినేత పవన్ కల్యాణ్ సిద్ధాంతాలను మండలవ్యాప్తంగా బలంగా ముందుకు తీసుకెళ్తున్నారు. యల్లటూరు భవన్ కేంద్రంగా తరచూ జనసేన కార్యకర్తలు, నాయకులతో సమావేశాలు నిర్వహిస్తూ కేడర్‌ను ఎన్నికల సమరానికి సన్నద్ధం చేస్తున్నారు. కూటమి పార్టీల సమన్వయం, పార్టీ శ్రేణుల మద్దతు ఆయనకు ప్రధాన బలంగా మారుతున్నాయి.

### 11 స్థానాల మండలంలో కీలక లెక్కలు

?నందలూరు మండల పరిషత్‌లో మొత్తం 11 ఎంపీటీసీ స్థానాలు ఉన్నాయి. 2021 ఎన్నికల్లో ఈ 11స్థానాలనూ వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకున్న నేపథ్యంలో, ప్రస్తుత ఎన్నికల్లో ఆ స్థానాల్లో రాజకీయ సమీకరణాలను మార్చి మెజారిటీ ఎంపీటీసీల మద్దతు కూడగట్టడమే లక్ష్యంగా ఆయన వర్గం కసరత్తు చేస్తోంది. సామాజిక వర్గాల మద్దతు, వ్యక్తిగత పరిచయాలు, కూటమి బలాన్ని ఏకం చేస్తూ ప్రత్యర్థులకు గట్టి పోటీ ఇచ్చేందుకు వ్యూహాలు రచిస్తున్నారు.

ఎంపీటీసీగా రెండు పర్యాయాల అనుభవం, మండల ఉపాధ్యక్ష పదవి, జెడ్పీటీసీగా విస్తృత ప్రజాదరణ, వీటన్నింటికీ తోడు జనసేన పార్టీ బలమైన వేదిక తోడవడంతో నందలూరు ఎంపీపీ రేసులో శివరామరాజు పేరు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. గ్రౌండ్ లెవెల్ రాజకీయాలను క్షుణ్ణంగా పరిశీలించిన యల్లటూరు వేస్తున్న పావులు మండల పీఠంపై ఎలాంటి ప్రభావం చూపుతాయో వేచిచూడాలి.

**నందలూరు ఎంపీపీ పీఠంపై యల్లటూరు గురి**

గ్రామస్థాయి నుంచి మండల స్థాయి వరకు సుదీర్ఘ రాజకీయ అనుభవం

2001లో ఎంపీటీసీగా శివరామరాజు విజయం.. అనంతరం మండల ఉపాధ్యక్ష పదవి

2006లో అధికార పార్టీ అభ్యర్థిపై స్వతంత్రంగా పోటీ చేసి విజయం

2014లో జెడ్పీటీసీగా భారీ మెజారిటీతో విజయం

కేడర్‌తో ప్రత్యక్ష సంబంధాలు.. గ్రామాల వారీగా సమీకరణాలకు పదును

రోడ్లు, గృహాలు, పింఛన్లు, గ్యాస్ కనెక్షన్ల వంటి అభివృద్ధి కార్యక్రమాలపై దృష్టి

జనసేన రాజంపేట నియోజకవర్గ కో-ఆర్డినేటర్‌గా మండలంపై ప్రత్యేక ఫోకస్

ఎంపీపీ పీఠం కోసం ఎంపీటీసీ సభ్యుల మద్దతుపై కీలక లెక్కల

నందలూరు మండల రాజకీయాల్లో యల్లటూరు వ్యూహం చర్చనీయాంశం

**ఎంపీపీ పీఠంపై యల్లటూరు గురి**

2దశబ్దాల పైగా స్థానిక రాజకీయ అనుభవం

గ్రామస్థాయి కేడర్.. బలమైన రాజకీయ పునాది

ఎంపీటీసీ సభ్యుల సమీకరణంపై ప్రత్యేక దృష్టి

యల్లటూరు వ్యూహంతో నందలూరు రాజకీయాల్లో పెరుగుతున్న వేడి.

# స్థానిక సంస్థలఎన్నికల నిర్వహణకు సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలి

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

సమాంతరంగా పట్టణ, ప్రాదేశిక, గ్రామ పంచాయతీ ఎన్నికలు

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలి





కడప, అక్టోబరు 14 మనం న్యూస్ : జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికలను స్వేచ్ఛాయుతంగా, నిష్పక్షపాతంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు సమగ్ర కార్యాచరణతో సిద్ధం కావాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని సభా భవన్‌లో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు సంబంధించి సమావేశంలో నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ తోపాటు.. జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాథ్, జాయింట్ కలెక్టర్ డా. నిధి మీనా, రాజంపేట సబ్ కలెక్టర్ హెచ్.ఎస్. భావన, జిల్లా రెవెన్యూ అధికారి మల్లికార్జునుడు, అదనపు ఎస్పీ ప్రకాష్ బాబు, కేఎంసి కమిషనర్ భవానీ ప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ శివరామిరెడ్డి, జెడ్పి సీఈవో సుబ్రమణ్యం, జిల్లా పంచాయతీ అధికారి రామచంద్ర హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. పరిమిత సమయంలో జిల్లా వ్యాప్తంగా ఎన్నికల ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలంటే ముందస్తు సన్నద్ధత, శాఖల మధ్య సమన్వయం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన కాలపరిమితికి అనుగుణంగా అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. పట్టణ స్థానిక సంస్థలు, మండల పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాలు, గ్రామ పంచాయతీల ఎన్నికల ప్రక్రియలు వరుసగా, కొన్ని దశల్లో సమాంతరంగా కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి అధికారి తన విధులు, బాధ్యతలపై పూర్తి అవగాహనతో ఉండాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం తొలిదశలో పట్టణ స్థానిక సంస్థల ఎన్నికలు, రెండో దశలో మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు, మూడో దశలో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ ఎన్నికల ప్రక్రియ డిసెంబరు 2వ తేదీ వరకు కొనసాగనున్న నేపథ్యంలో ప్రతి దశకు అవసరమైన ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు.

### పట్టణ (మున్సిపల్) స్థానిక సంస్థల ఎన్నికలు.

పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియలో భాగంగా అక్టోబరు 14న రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రకటన, అక్టోబరు 16న ఎన్నికల అధికారి నోటీసు, నామినేషన్ల స్వీకరణ, అక్టోబరు 18న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ, అక్టోబరు 19న నామినేషన్ల పరిశీలన, అక్టోబరు 21న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటించనున్నారు. అక్టోబరు 28న పోలింగ్, అక్టోబరు 30న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరగనున్నాయి.

### మండల, జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గాల ఎన్నికలు

ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల ప్రక్రియలో భాగంగా అక్టోబరు 19న నోటిఫికేషన్, అక్టోబరు 21న ఎన్నికల అధికారి నోటీసు జారీ, నామినేషన్ల స్వీకరణ చేయనున్నారు. అక్టోబరు 23న నామినేషన్ల స్వీకరణకు చివరి తేదీ, అక్టోబరు 24న నామినేషన్ల పరిశీలన చేపడతారు. తిరస్కరించిన నామినేషన్లపై అక్టోబరు 25, 26 తేదీల్లో అప్పీళ్లు స్వీకరించి పరిష్కరిస్తారు. అక్టోబరు 27న నామినేషన్ల ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు. అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను ప్రకటిస్తారు. నవంబరు 3న పోలింగ్, నవంబరు 5న ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటన జరుగుతాయి.

### మూడు విడతల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు

గ్రామ పంచాయతీ ఎన్నికలను మూడు విడతల్లో నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు. మొదటి విడత పోలింగ్ నవంబరు 26న, రెండో విడత నవంబరు 29న, మూడో విడత డిసెంబరు 2న జరగనుంది. జిల్లాలో ఏ ప్రాంతాలను ఏ విడతలో చేర్చాలనే అంశాన్ని సంబంధిత అధికారులతో చర్చించి త్వరలో ఖరారు చేస్తామని పేర్కొన్నారు. గ్రామ పంచాయతీల్లో వార్డు సభ్యులు, సర్పంచ్ పదవులకు సంబంధించి రిజర్వేషన్ల ఖరారు ప్రక్రియను కూడా పూర్తి చేయాలని సూచించారు. ప్రత్యక్ష ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం సంబంధిత స్థానిక సంస్థల్లో పరోక్ష ఎన్నికలు నిర్వహించేందుకు ప్రత్యేక షెడ్యూల్ ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు వివరించారు.

### ముందస్తు ఏర్పాట్లు పూర్తి చేయాలి

పంచాయతీరాజ్, పురపాలక శాఖల పరిధిలో ఓటర్ల జాబితాల ఖరారు, పోలింగ్ కేంద్రాల గుర్తింపు, వాటి ప్రకటన, వివిధ పదవులకు రిజర్వేషన్ల ఖరారు వంటి ముందస్తు ప్రక్రియలను పూర్తి చేసినట్లు కలెక్టర్ తెలిపారు. గ్రామ పంచాయతీల వార్డులు, సర్పంచ్ పదవులకు సంబంధించిన రిజర్వేషన్లను కూడా ఖరారు చేయాలని సూచించారు.

రెవెన్యూ డివిజనల్ అధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, పంచాయతీరాజ్ శాఖ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా పరిషత్, జిల్లా పంచాయతీ అధికారులు, పోలీసు శాఖ అధికారులు ఎన్నికల విధులపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, జాయింట్ కలెక్టర్, జిల్లా పోలీసు అధికారి సహా సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేయాలని ఆదేశించారు.ఎన్నికలకు ముందు చేపట్టాల్సిన ఏర్పాట్లు, పోలింగ్ సమయంలో అనుసరించాల్సిన విధానాలు, ఎన్నికల అనంతరం పూర్తి చేయాల్సిన ప్రక్రియలపై అధికారులు స్పష్టమైన కార్యాచరణ రూపొందించుకోవాలని సూచించారు. ఎన్నికల సామగ్రి, బ్యాలెట్ పత్రాలు, బ్యాలెట్ పెట్టెలు, పోలింగ్ సిబ్బంది నియామకం, రవాణా, భద్రత, సున్నితమైన పోలింగ్ కేంద్రాల గుర్తింపు వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోపాలకు తావులేకుండా, ఎన్నికల సంఘం మార్గదర్శకాలను ఖచ్చితంగా పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో ఎన్నికల విధులు కేటాయించిన ఆర్వోలు, ఈఆర్వోలు, ఏఏఆర్వోలు తదితర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

## స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా సహకరించండి : ఎస్సై హారిక



సిద్దవటం, అక్టోబర్ 13 మనం న్యూస్ : స్థానిక సంస్థల ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో, ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావులేకుండా జరిగేలా రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని సిద్దవటం ఎస్సై హారిక సూచించారు. ఎన్నికల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆమె కోరారు. రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నేపథ్యంలో సిద్దవటం మండలంలో పోలీసులు అప్రమత్తంగా వ్యవహరిస్తున్నారు. మండల పరిధిలో 18 గ్రామ పంచాయతీ సర్పంచ్ పదవులు, 11 ఎంపీటీసీ స్థానాలు, ఒక జెడ్పీటీసీ స్థానానికి ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికల సమయంలో రాజకీయ పార్టీల మధ్య విభేదాలు, వాగ్వాదాలు ఘర్షణలకు దారితీయకుండా నాయకులు తమ కార్యకర్తలకు సూచనలు చేయాలని ఎస్సై హారిక తెలిపారు. ఓటర్లను ప్రలోభపెట్టడం, బెదిరించడం, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలన్నారు. ఎన్నికల నియమావళిని ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా పాటించాలని సూచించారు. గ్రామాల్లో శాంతిభద్రతలకు భంగం కలిగించే ప్రయత్నాలు చేసినా, ఎన్నికల సందర్భంగా గొడవలకు దిగినా చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పోలీసులకు సహకరించాలని ఆమె కోరారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలి

**టీడీపీ మండల అధ్యక్షులు ఎంజర్ల నారాయణ రెడ్డి**



పెనగలూరు(అక్టోబర్ 14), మనంన్యూస్: స్థానిక సంస్థల ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్త, నాయకులు పని చేయాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షులు ఎంజర్ల నారాయణ రెడ్డి తెలిపారు. బుధవారం పెనగలూరు తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన మండల పార్టీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించి పార్టీ నాయకులు, మండల కమిటీ సభ్యులు, క్లస్టర్ ఇన్‌ఛార్జులు, యూనిట్ ఇన్‌ఛార్జులు, గ్రామ కమిటీ అధ్యక్షులు, బూత్ ఇన్‌ఛార్జులు మరియు పార్టీ శ్రేణులందరూ సమన్వయంతో, ఐకమత్యంతో పనిచేయాలని చర్చించినట్లు చెప్పారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయమే లక్ష్యంగా ప్రతి ఒక్కరూ క్రమశిక్షణతో, సమష్టి కృషితో పనిచేసి, పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేయాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందన్నారు. సాధ్యమైనంత ఉత్తమ ఫలితాలు సాధించడంతో పాటు, పార్టీ నిర్దేశించుకున్న లక్ష్యమైన 100 శాతం విజయాన్ని సాధించేందుకు సమష్టిగా కృషి చేయాలని ఈ సమావేశం ఏకగ్రీవంగా తీర్మానించడం జరిగిందని పేర్కొన్నారు. కట్టావారిపల్లి నాగేశ్వర నాయుడు, కాకి శ్రీరాములు, కొరముట్ల వెంకట సుబ్బయ్య, మొలకల మల్లయ్య, మైనార్టీ నాయకులు షామీర్‌బాషా,యువ నాయకుడు ఎంజర్లసాయిరెడ్డి పాల్గొన్నారు.

## చికెన్ వ్యర్థాల తరలింపును అరికట్టే వారే లేరా

**– నిద్ర వ్యవస్థలో అధికారులు –**



చిట్వేలి అక్టోబర్ 14 మనం న్యూస్: మండల పరిధిలోని చిట్వేలి రాపూర్ రోడ్డు సరిహద్దు వెంబడి వెళ్తున్న చికెన్ వ్యర్థాల వాహనాలను రాకుండా చేయవలసిన బాధ్యత అధికారులు, ప్రజాప్రతినిధుల పైన ఉంది అటు అధికారులు కానీ ఇటు ప్రజా ప్రతినిధులు గాని దానిపైన దృష్టి పెట్టకపోవడం బాధాకరము ఇంత పెద్ద వ్యవస్థలో ఇలాంటి వ్యర్థాలు పోకుండా చేయవలసిన బాధ్యత చెక్ పోస్టులు ఏర్పాటు చేసి అప్రమత్తత చేసే డిపార్ట్మెంటులో ఉన్నాయి. అలాగే పంచాయతీరాజ్ డిపార్ట్మెంట్ దీనిపైన దృష్టి పెట్టవలసి ఉంది. ప్రజల చేత ఎన్నికైన ప్రజాప్రతినిధులు కూడా ఇలాంటి వ్యర్థాలు తరలించకుండా నిలువరించవలసిన అవసరం ఎంతైనా ఉంది. కుళ్లిన చికెన్ వ్యర్థాలను తరలించి రొయ్యల చెరువులో వేయడం వలన ప్రమాదకరమైనటువంటి వ్యాధులు వస్తాయని ప్రజలలో భయాందోళనలు ఉన్నాయి. ప్రజల శ్రేయస్సు కోసం ఇంత పెద్ద వ్యవస్థ ఉండి ప్రజాప్రతినిధులు ఉండి కూడా ఫలితం కనిపించడం లేదు ఏది ఏమైనప్పటికీ చికెన్ వ్యర్థాలను పూర్తిగా నిలువరించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉంది దీనిపైన సమాజ సేవకులు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ప్రజలలో చైతన్యం వచ్చినంత వరకు కొంతమంది ఇలాంటి వ్యర్థాల ను తరలిస్తూ ఉంటారు అన్నది నగ్నసత్యం ప్రజలలో చైతన్యం రావాలి అలాంటి రోజున మాత్రమేఇలాంటి వాటిని నిరోధించగలుగుతారు అని సమాజ సేవకులు హెచ్చరిస్తున్నారు కనీసం చికెన్ వ్యర్థాలు తీసుకువెళుతున్న వాహనాలు పైన పట్టా కూడా కట్టకుండా వెళుతూ ఉంటే కుళ్ళిన వాసనతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.




# దళిత నియోజకవర్గంలో రిజర్వేషన్లెక్కడ..?!

దళిత నియోజకవర్గంలో రిజర్వేషన్లెక్కడ..?!

ఐదు మండలాల్లోనూ ఓసీలకే ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు..!

ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఒక్క స్థానం కూడా దక్కలేదా?

సామాజిక న్యాయంపై చర్చకు దారితీస్తున్న రిజర్వేషన్ల కేటాయింపు..

బడుగు వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించడంలో వైఫల్యమా?

పెనగలూరు( అక్టోబర్ 14), మనం న్యూస్:
సామాజిక న్యాయం.. రాజకీయ ప్రాతినిధ్యం.. అణగారిన వర్గాలకు అధికారంలో భాగస్వామ్యం! ఇవి ప్రజాస్వామ్య వ్యవస్థలో అత్యంత కీలకమైన అంశాలు. అయితే, దళిత నియోజకవర్గంగా గుర్తింపు పొందిన రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్ల కేటాయింపు మాత్రం ఇప్పుడు చర్చనీయాంశంగా మారుతోంది. నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లో ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాల రిజర్వేషన్లన్నీ అన్‌రిజర్వ్డు, అన్‌రిజర్వ్డు మహిళా కేటగిరీలకే కేటాయించడంతో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం ఎక్కడనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.
నియోజకవర్గంలో సామాజికంగా వెనుకబడిన వర్గాలకు రాజకీయంగా అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉన్నప్పటికీ, మండల పరిషత్ అధ్యక్ష (ఎంపీపీ), జిల్లా పరిషత్ ప్రాదేశిక నియోజకవర్గ (జడ్పీటీసీ) స్థానాల కేటాయింపుల్లో ఆ వర్గాలకు ఒక్క స్థానం కూడా దక్కలేదని అందుబాటులో ఉన్న వివరాలు సూచిస్తున్నాయి. దీంతో రిజర్వేషన్ల ప్రక్రియలో సామాజిక న్యాయం ప్రతిబింబించలేదనే విమర్శలు వినిపించే అవకాశం ఉంది.

**ఐదు మండలాలు.. ఐదు ఎంపీపీ స్థానాలు.. ఒక్కటీ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు లేదా?**

రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల ఎంపీపీ రిజర్వేషన్ల వివరాలను పరిశీలిస్తే రైల్వేకోడూరు ఎంపీపీ స్థానం అన్‌రిజర్వ్డు మహిళకు, ఓబులవారిపల్లి అన్‌రిజర్వ్డుకు, పుల్లంపేట అన్‌రిజర్వ్డు మహిళకు, చిట్వేలి అన్‌రిజర్వ్డు మహిళకు, పెనగలూరు అన్‌రిజర్వ్డుకు కేటాయించినట్లు పేర్కొంటున్నారు.
ఈ కేటాయింపుల ప్రకారం ఐదు ఎంపీపీ స్థానాల్లో మూడు మహిళలకు అన్‌రిజర్వ్డు కేటగిరీలో, మరో రెండు అన్‌రిజర్వ్డు కేటగిరీలో ఉన్నాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు ప్రత్యేకంగా రిజర్వు చేసిన ఎంపీపీ స్థానం ఒక్కటీ లేకపోవడం రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది.

**జడ్పీటీసీ స్థానాల్లోనూ అదే పరిస్థితి!**

జడ్పీటీసీ రిజర్వేషన్లలోనూ ఇదే తరహా పరిస్థితి కనిపిస్తోంది. రైల్వేకోడూరు, పుల్లంపేట, చిట్వేలి జడ్పీటీసీ స్థానాలు అన్‌రిజర్వ్డు కేటగిరీలో ఉండగా, ఓబులవారి పల్లి, పెనగలూరు స్థానాలు అన్‌రిజర్వ్డు మహిళా కేటగిరీకి కేటాయించినట్లు వివరాలు వెల్లడిస్తున్నాయి.
దీంతో ఐదు మండలాల్లోని ఎంపీపీ, జడ్పీటీసీ స్థానాలు కలిపి మొత్తం పది పదవుల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్ దక్కలేదనే అంశం చర్చకు వస్తోంది. నియోజకవర్గ సామాజిక స్వరూపం, స్థానిక సంస్థల్లో అన్ని వర్గాలకు సముచిత ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం నేపథ్యంలో ఈ కేటాయింపులపై సమగ్ర పరిశీలన జరగాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**దళిత నియోజకవర్గంలో బడుగు వర్గాల ప్రాతినిధ్యం ప్రశ్నార్థకమా?**

రైల్వేకోడూరు అసెంబ్లీ నియోజకవర్గం ఎస్సీ రిజర్వ్డు నియోజకవర్గం కావడంతో ఇక్కడి రాజకీయాల్లో దళిత వర్గాల ప్రాతినిధ్యానికి ప్రత్యేక ప్రాధాన్యం ఉంది. అలాంటి నియోజకవర్గ పరిధిలోని స్థానిక సంస్థల కీలక పదవుల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ప్రత్యేక రిజర్వేషన్లు లేకపోవడం సామాజిక న్యాయంపై చర్చకు దారితీస్తోంది.
అయితే, అన్‌రిజర్వ్డు స్థానాల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన అభ్యర్థులు పోటీ చేయడానికి నిబంధనల ప్రకారం అవకాశం ఉండవచ్చు. అందువల్ల ఆయా వర్గాలకు చెందినవారు ఎన్నికల్లో పోటీ చేయలేరని చెప్పడం సరికాదు. కానీ, చట్టబద్ధమైన రిజర్వేషన్ల ద్వారా నిర్దిష్ట వర్గాలకు కల్పించే ప్రాతినిధ్యం, సాధారణ స్థానాల్లో పోటీ చేసే అవకాశంతో సమానం కాదన్నది రాజకీయంగా ప్రస్తావించదగిన అంశం.

**రిజర్వేషన్ల కేటాయింపు ఎలా జరిగింది? పరిశీలన అవసరం!**

స్థానిక సంస్థల రిజర్వేషన్లు జనాభా నిష్పత్తి, వర్తించే చట్టాలు, ప్రభుత్వ మార్గదర్శకాలు, రొటేషన్ విధానం, రిజర్వేషన్ల రోస్టర్ వంటి నిబంధనలకు అనుగుణంగా నిర్ణయించబడతాయి. అందువల్ల రైల్వేకోడూరు నియోజకవర్గ పరిధిలోని ఐదు మండలాల్లోనూ ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వేషన్లు దక్కకపోవడానికి గల కారణాలను అధికార యంత్రాంగం స్పష్టం చేయాల్సిన అవసరం ఉంది. రిజర్వేషన్ల ఖరారులో అనుసరించిన విధానం, జనాభా గణాంకాలు, రోస్టర్ వివరాలు, మండలాల వారీగా వర్తింపజేసిన ప్రమాణాలను బహిర్గతం చేస్తే ఈ అంశంపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. కేటాయింపులు నిబంధనలకు అనుగుణంగా జరిగాయా? రొటేషన్ విధానం సక్రమంగా అమలైందా? సామాజిక వర్గాల ప్రాతినిధ్యం విషయంలో ఏవైనా లోపాలు ఉన్నాయా? అనే ప్రశ్నలకు అధికారిక సమాధానాలు అవసరం.

**బడుగు వర్గాలకు న్యాయం జరిగేలా చూడాలి!**

స్థానిక సంస్థలు గ్రామీణ ప్రజల సమస్యల పరిష్కారానికి, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు కీలక వేదికలు. అలాంటి వ్యవస్థల్లో అన్ని సామాజిక వర్గాలకు న్యాయబద్ధమైన ప్రాతినిధ్యం ఉండటం ప్రజాస్వామ్యానికి బలం చేకూరుస్తుంది. రైల్వేకోడూరు నియోజకవర్గంలో ఎంపీపీ, జడ్పీటీసీ రిజర్వేషన్లపై తలెత్తిన ఈ చర్చకు అధికారులు సమగ్ర వివరాలతో సమాధానం చెప్పాల్సిన అవసరం ఉంది.

# కాఫీ పొడి మాటున ఎర్రచందనం స్మగ్లింగ్!

**8 మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లు అరెస్ట్.. 1.984 టన్నుల దుంగలు స్వాధీనం**

**రూ.1.30 కోట్ల విలువైన దుంగలు, వాహనాలు సీజ్**



కడప, అక్టోబర్ 14 మనం న్యూస్ : కాఫీ పొడి ప్యాకెట్ల మాటున ఎర్రచందనం దుంగలను అక్రమంగా తరలిస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టును కడప జిల్లా పోలీసులు రట్టు చేశారు. ఈ కేసులో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి, వారి నుంచి 1.984 టన్నుల బరువున్న 70 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. మూడు వాహనాలతో పాటు 643 కాఫీ పొడి అట్టపెట్టెలను సీజ్ చేశారు. స్వాధీనం చేసుకున్న మొత్తం సొత్తు విలువ సుమారు రూ.1.30 కోట్లు ఉంటుందని అంచనా వేశారు. ఎర్రచందనం అక్రమ రవాణాపై అందిన సమాచారంతో అప్రమత్తమైన పోలీసులు ఎస్.ఏ.కాశినాయన మండలం ఆకుల నారాయణపల్లె సమీపంలో వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో కాఫీ పొడి ప్యాకెట్ల లోడుతో వెళ్తున్న వాహనంలో భారీగా ఎర్రచందనం దుంగలు బయటపడ్డాయి. దీంతో అక్రమ రవాణాకు పాల్పడుతున్న ముఠాను అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసు వివరాలను జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ బుధవారం మీడియాకు వెల్లడించారు. అరెస్టయిన వారిలో తమిళనాడుకు చెందిన ఏడుగురు, ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఒకరు ఉన్నట్లు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని పేర్కొన్నారు.

ఎర్రచందనం అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని, పునరావృత నేరస్థులపై అవసరమైతే పీడీ యాక్ట్ అమలు చేస్తామని హెచ్చరించారు. కేసును ఛేదించిన పోలీసు సిబ్బందిని ఎస్పీ అభినందించారు.



# ప్రజాసేవలో ముద్దపోలు సభాపతి, ఆదర్శంగా జన్మదిన వేడుకలు

పండ్లు, బ్రెడ్ల పంపిణీతో రోగులు, పారిశుద్ధ్య కార్మికులకు సేవా కార్యక్రమాలు

సామాజిక ఆరోగ్య కేంద్రంలో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ చిత్రపటాల ఆవిష్కరణ

సాధారణ మెకానిక్ నుంచి జనసేన పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడి వరకు ఎదిగిన ప్రస్థానం





రైల్వేకోడూరు, అక్టోబర్ 14, మనం న్యూస్ ప్రజాసేవే పరమావధిగా భావిస్తూ, కార్మికుల సంక్షేమం కోసం అహర్నిశలు శ్రమిస్తున్న జనసేన పార్టీ రాజంపేట పార్లమెంట్ ఎన్నికల పరిశీలక సభ్యులు ముద్దపోలు సభాపతి జన్మదిన వేడుకలు తిరుపతి జిల్లా రైల్వే కోడూరు పట్టణంలో బుధవారం అత్యంత అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆయన అభిమానులు, జనసేన నాయకులు, వీర మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని సభాపతికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

**సేవా దృక్పథం చాటుకున్న వేడుకలు**

కేవలం కేక్ కటింగ్ వేడుకలకే పరిమితం కాకుండా సామాజిక బాధ్యతగా తన జన్మదినాన్ని నిర్వహించు కోవడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. జన్మదినోత్సవంలో భాగంగా రైల్వే కోడూరు స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రం ను సభాపతి సందర్శించారు. ఆసుపత్రిలో ఇన్ పేషెంట్లుగా చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి, వారికి పండ్లు, బ్రెడ్లు అందజేశారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుతూ రోగులకు సేవలందిస్తున్న పారిశుద్ధ్య కార్మికుల సేవలను అభినందిస్తూ వారికీ కూడా ఆహార పదార్థాలను పంపిణీ చేశారు.

**సామాజిక ఆరోగ్య కేంద్రంలో నాయకుల చిత్రపటాల ఏర్పాటు**

ఈ పర్యటనలో భాగంగా సామాజిక ఆరోగ్య కేంద్రంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మరియు ఉప ముఖ్యమంత్రి, జనసేనాని పవన్ కళ్యాణ్ ల చిత్రపటాలు లేకపోవడాన్ని సభాపతి గమనించారు. వెంటనే స్పందించి చిత్రపటాలను తెప్పించి, స్వయంగా దగ్గరుండి ఆసుపత్రి ఆవరణలో అమర్చారు. కూటమి ప్రభుత్వంపై, తమ నాయకులపై ఉన్న నమ్మకాన్ని, అభి మానాన్ని ఈసందర్భంగా ఆయన పునరుద్ఘాటించారు.

**కష్టపడే తత్వమే ఎదిగేలా చేసింది**

ఒక సాధారణ మధ్యతరగతి కుటుంబంలో జన్మించిన ముద్దపోలు సభాపతి, ఒక సాధారణ మెకానిక్‌గా తన ప్రస్థానాన్ని ప్రారంభించారు. నిరంతరం ప్రజా సమస్యలపై స్పందిస్తూ, పలు వృత్తి సంఘాలు మరియు సామాజిక సంఘాలకు అధ్యక్షుడిగా ఎన్నికై శ్రమజీవుల శ్రేయస్సు కోసం పోరాడారు. అటు కార్మికుడిగా, ఇటు జనసేన పార్టీ పట్ల క్రమశిక్షణ, నిబద్ధత కలిగిన నాయకుడిగా ఎదుగుతూ నేడు రాజంపేట పార్లమెంట్ ఎన్నికల పరిశీలకుడి స్థాయికి చేరుకుని ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.

**మీ నమ్మకాన్ని ఎల్లవేళలా కాపాడుకుంటా: ముద్దపోలు సభాపతి**

జన్మదిన వేడుకలను ఉద్దేశించి ముద్దపోలు సభాపతి భావోద్వేగంతో మాట్లాడుతూ నాపై ఎనలేని ప్రేమాభిమానాలను చూపిస్తున్న నా అభిమానులకు, కుటుంబ సభ్యులకు, ఆప్తమిత్రులకు, జనసేన పార్టీ నాయకులకు, ప్రాణ సమానులైన వీర మహిళలకు పేరుపేరునా నా హృదయపూర్వక ధన్యవాదాలు. మీరు నాపై ఉంచిన నమ్మకమే నాకు కొండంత బలం. ఏ కష్టం వచ్చినా మీ వెంటే ఉంటూ, సమస్యల పరిష్కారంలో ఎప్పుడూ ముందు వరుసలో నిలబడే సేవకుడిగా ఉంటానని మాట ఇస్తున్నాను అని తెలిపారు. ఈ వేడుకల్లో జనసేన పార్టీ ప్రముఖ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, అభిమానులు మరియు ముద్దపోలు నవీన్, ముద్దపోలు వెంకటేష్, సతీష్, దుష్యంత్, బాలాజీ,తోట సుబ్రహ్మణ్యం, తోట దేవ మరియు స్థానిక ప్రజలు విశేష సంఖ్యలో పాల్గొని సభాపతికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# కిలో రూ. 800 పలికే ఈ పండు గురించి తెలుసా?..



- సాగుతో ఏపీ రైతు దశ తిరిగింది!
- హైదరాబాద్ ఉద్యోగం వదిలి వ్యవసాయంలోకి వచ్చిన యువకుడు
- ఎన్టీఆర్ జిల్లాలో గాక్ పండ్ల సాగుతో ఏడాదికి రూ. 30 లక్షల ఆదాయం
- మిరప పంట నష్టపోవడంతో ప్రత్యామ్నాయ పంటగా ఎంపిక
- మధ్యవర్తులు లేకుండా నేరుగా వినియోగదారులకే విక్రయం
- సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తూ ఇతర రైతులకు ఆదర్శంగా నిలుస్తున్న శేషుబాబు

రామిరెడ్డిపల్లి మనం న్యూస్: సంప్రదాయ పంటలతో నష్టాలు వస్తున్నాయని చాలామంది రైతులు ఆవేదన చెందుతుంటే, కొందరు మాత్రం వినూత్న ప్రయోగాలతో వ్యవసాయంలో అద్భుతాలు సృష్టిస్తున్నారు. అలాంటి వారిలో ఒకరే ఎన్టీఆర్ జిల్లాకు చెందిన రైతు బి. శేషుబాబు. హైదరాబాద్‌లోని తన ఉద్యోగాన్ని వదిలి, అరుదైన గాక్ పండ్ల సాగుతో సంవత్సరానికి సుమారు రూ. 30 లక్షల ఆదాయం ఆర్జిస్తూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నారు.ఎన్టీఆర్ జిల్లా రామిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన శేషుబాబు, 2020లో హైదరాబాద్‌లోని సామాజిక సంక్షేమ శాఖ ఉద్యోగానికి రాజీనామా చేసి సొంతూరికి తిరిగి వచ్చారు. కుటుంబంతో కలిసి వ్యవసాయం ప్రారంభించారు. అయితే, వాతావరణ మార్పుల కారణంగా మిరప పంటలో తీవ్ర నష్టాలు ఎదుర్కోవడంతో ప్రత్యామ్నాయ పంటల కోసం అన్వేషణ ప్రారంభించారు. ఈ క్రమంలో ఆగ్నేయాసియాకు చెందిన 'గాక్' పండు గురించి తెలుసుకున్నారు. లైకోపీన్, బీటా-కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉండే ఈ పండుకు మంచి డిమాండ్ ఉందని గ్రహించారు. వెంటనే వియత్నాం నుంచి దిగుమతి చేసుకున్న మొక్కలను కొనుగోలు చేశారు. 2023 మార్చిలో ఒక్కో మొక్కకు రూ. 700 ఖర్చు చేసి, పావు ఎకరం విస్తీర్ణంలో 100 మొక్కలు నాటారు. కేవలం నాలుగు నెలల్లోనే పంట చేతికి వచ్చింది. తొలి పంటలోనే సుమారు 2,100 కిలోల దిగుబడి రాగా, కిలో రూ. 800 చొప్పున విక్రయించి రూ. 16 లక్షలకు పైగా సంపాదించారు. ఈ విజయంతో ఉత్సాహం పొందిన ఆయన, తన సాగును 75 సెంట్ల భూమికి విస్తరించారు. ప్రస్తుతం ఆయన పొలంలో 300 మొక్కలు ఉండగా, వాటిలో 210 ఆడ మొక్కలు ఉన్నాయి. ఒక్కో ఆడ మొక్క 30 కిలోల వరకు దిగుబడినిస్తోంది. మొత్తం మీద 6,000 కిలోలకు పైగా దిగుబడి సాధిస్తూ, కిలోకు రూ. 500 నుంచి రూ. 600 వరకు విక్రయిస్తున్నారు.గాక్ పండ్ల సాగులో దిగుబడి పెంచడానికి చేతితో పరాగ సంపర్కం చేయాల్సి ఉంటుందని శేషుబాబు తెలిపారు. పూర్తిగా పండిన ఒక్కో కాయ 750 గ్రాముల నుంచి కిలోకు పైగా బరువు తూగుతుంది. ఈ పంటను పూర్తిగా సేంద్రియ పద్ధతుల్లో పండిస్తున్న ఆయన, మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా హైదరాబాద్‌తో పాటు ఇతర ప్రాంతాల్లోని వినియోగదారులకు అమ్ముతున్నారు. గాక్ పండ్లతో పాటు డ్రాగన్ ఫ్రూట్, జామ వంటి ఇతర పంటలను కూడా సాగు చేస్తూ తన వ్యవసాయ క్షేత్రాన్ని వైవిధ్యభరితంగా మార్చుకున్నారు. శేషుబాబు విజయం, సంక్షోభంలో ఉన్న రైతులకు కొత్త దారి చూపుతోంది.

# గుజరాత్‌లో చారిత్రక ఘట్టం.. 144 ఏళ్ల తర్వాత బర్దాకు తిరిగివచ్చిన ఆసియా సింహాలు

**గుజరాత్:** గుజరాత్‌లోని సౌరాష్ట్ర ప్రాంతంలో ఉన్న బర్దా వన్యప్రాణుల అభయారణ్యంలో 144 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత ఆసియా సింహాలు మళ్లీ అడుగుపెట్టాయి. ఒకప్పుడు సింహాల జాడలేని ఈ ప్రాంతం ఇప్పుడు 17 సింహాలతో కళకళలాడుతోంది. ఆసియా సింహాల సంరక్షణలో ఇదొక చారిత్రక విజయంగా పర్యావరణవేత్తలు అభివర్ణిస్తున్నారు. గిర్ అడవులకు మాత్రమే పరిమితమైన సింహాలకు, బర్దా అభయారణ్యం రెండో సురక్షిత ఆవాసంగా మారనుంది. 'బియాండ్ గిర్: బర్దా వైల్డ్‌లైఫ్ శాంక్చురీ యాజ్ ఏ పొటెన్షియల్ స్ట్రాంగ్‌హోల్డ్ ఫర్ ఏషియాటిక్ లయన్స్' పేరుతో ప్రఖ్యాత 'ప్లోస్ వన్' జర్నల్‌లో ప్రచురితమైన ఒక అధ్యయనం ప్రకారం, బర్దా అభయారణ్యం సింహాల దీర్ఘకాలిక మనుగడకు అత్యంత అనుకూలమైన ప్రాంతమని తేలింది. సుమారు 192.31 చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఉన్న ఈ ప్రాంతంలో సింహాలకు అవసరమైన ఆహారం, సహజ ఆవాసం, పర్యావరణ పరిస్థితులు ఉన్నాయని ఈ అధ్యయనం నిర్ధారించింది. కొన్నేళ్ల క్రితం గిర్ అడవుల నైరుతి ప్రాంతం నుంచి ఒక మగ సింహం సహజంగా వలస వచ్చి బర్దాకు చేరుకుంది. దీనిని ఒక అవకాశంగా తీసుకున్న గుజరాత్ అటవీ శాఖ, ఆ తర్వాత ఐదు ఆడ సింహాలను ఇక్కడికి ప్రవేశపెట్టింది. జనవరి 2023 నుంచి జూలై 2025 మధ్యకాలంలో ఒక మగ, ఐదు ఆడ సింహాలకు రేడియో కాలర్లు అమర్చిన పరిశోధకులు, వాటి కదలికలను నిశితంగా గమనించారు. 1,69,000 జీపీఎస్ లొకేషన్ల ద్వారా వాటి ప్రవర్తనను విశ్లేషించారు. ఈ సింహాలు బర్దాలోని అడవులు, గడ్డి భూములలో తమ నివాస పరిధులను ఏర్పరుచుకుని, స్థిరపడినట్లు పరిశోధకులు ధ్రువీకరించారు.

# మహాచండీదేవిగా సాయినగర్ విజయదుర్గాదేవి



సిద్ధవటం, అక్టోబర్ 14 మనం న్యూస్ : శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో 4వ రోజు ఉప్పరపల్లి పంచాయతీ సాయినగర్‌లోని భద్రావతి భావనారాయణ స్వామి ఆలయంలో శ్రీ విజయదుర్గాదేవి మహాచండీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ నిర్వాహకులు అమ్మవారిని పుష్పమాలలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అమ్మవారిని దర్శించుకున్న స్థానిక భక్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అర్చకులు అమర్నాథ్ శర్మ మాట్లాడుతూ దేవి శరన్నవ రాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారి మూల విరాట్ విగ్రహానికి పంచామృత అభిషేకాలు వంటి విశేషమైన పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించామన్నారు ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు గ్రామస్తులు పాల్గొన్నారు

# బీసీవై పార్టీ ఎన్నారై కువైట్, ఆనంగి సేవాసమితి ఆధ్వర్యంలో ఆర్థిక సాయం.



చిట్వేలీ అక్టోబర్ 14 మనం న్యూస్: నెల్లూరు జిల్లా, రాపూర్ మండలం కోట్పాడు గ్రామానికి చెందిన గండు పెంచలమ్మ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న కారణంగా బీసీవై పార్టీ ఎన్నారై కువైట్ వారి ఆధ్వర్యంలో 10,000 వేలు, అలాగే ఆనంగి సేవాసమితి వారి ఆధ్వర్యంలో 20,000 వేల రూపాయలు బాధిత మహిళలకు బీసీవై పార్టీ నేతలు ఆర్థిక సహాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై కువైట్ గౌరవ సలహాదారులు బొల్లి వెంకటేష్, ఒంటెల వెంకటసుబ్బయ్య, మించల వెంకటసుబ్బయ్య, బత్తల నాగరాజు, చిట్వేలీ మండలం బీసీవై పార్టీ అధ్యక్షులు ఆనంగి పెంచలయ్య, తదితర బీసీవై పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బాలాత్రిపురాసుందరిగా గంగా భవాని అమ్మవారు



సిద్ధవటం, అక్టోబర్ 14 మనం న్యూస్ : శరన్నవ రాత్రి ఉత్సవాలు శోభాయ మానంగా భక్తిశ్రద్ధల నడుమ జరుగుతున్నాయి సిద్ధవటం మండలం మాధవరం, 1 బంగారు పేట గ్రామంలో వేసిన గంగా భవాని ఆలయంలో బుధవారం శరన్నవ రాత్రి ఉత్సవాలు సందర్భంగా అమ్మవారు 4 వ రోజు భక్తులకు బాలా త్రిపుర సుందరి దేవి అలంకారణతో భక్తులకు దివ్య దర్శనం ఇచ్చింది ఈ సందర్భంగా భక్తులు మాట్లాడుతూ దేవి నవరాత్రి ఉత్సవాల సందర్భంగా గంగాభవాని అమ్మవారు ప్రతిరోజు వివిధ అలంకరణతో భక్తులకు దివ్య దర్శనం ఇస్తుందన్నారు ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు అన్ని వసతులు సమకూర్చారని పేర్కొన్నారు జనసేన చేనేత విభాగ కార్యదర్శి రాటాల రామయ్య మాట్లాడుతూ అమ్మవారి కృపతో సకాలంలో వర్షాలు పడి రైతుల పంటలు సిరిసంపదలతో పండాలని అమ్మవారిని వేడుకున్నానన్నారు ఈ కార్యక్రమంలో మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# గజలక్ష్మి అలంకారంలో వాసవి మాత

ఒంటిమిట్ట. అక్టోబర్ 14(మనంన్యూస్): ఒంటిమిట్ట మెయిన్ బజార్లో వెలిసిన శ్రీ వాసవి మాత ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి అందులో భాగంగా 4వ రోజు బుధవారం శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరిదేవి గజలక్ష్మి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం అమ్మవారికి అర్చకులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా అమ్మవారికి శాస్త్రోక్తంగా ఏలేశ్వరం . గురు దీక్షిత్ శర్మ పంచామృత అభిషేకాలు నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించారు. ఆలయానికి వచ్చిన భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉభయదారుల ఆధ్వర్యంలో అమ్మవారికి సహస్రనామ అష్టోత్తర కుంకుమార్చన, నివేదన, మంగళహారతి నిర్వహించడం జరిగింది. సాయంకాలం గజలక్ష్మి అలంకారంలో వాసవికన్యకా పరమే శ్వరి మాత ఆలయానికి వచ్చిన భక్తులకు కనుల విందు చేసింది. ఆర్యవైశ్యులే కాకుండా గ్రామానికి చెందిన ప్రజలు అమ్మవారి ఆలయానికి తరలివచ్చి అర్చకులు అమ్మవారికి నిర్వహించే పూజా కార్యక్రమాల్లో పాల్గొని తనివి తీరా తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించడం జరిగింది.

